జాఫర్‌పల్లి దగ్గర ఏర్పాటు చేసిన మిషన్‌భగీరథ ప్లాంటు



షాబాద్ మండలం అంతారంలోని ఫిల్టరవుతున్న నీరు

నాడు ఎట్లుండే.. నేడు ఎట్లయింది..

జాఫర్‌పల్లిలోని మిషన్‌భగీరథ నీటిని శుద్ధి కేంద్రం

జలధార

తాగునీటి గోస తీర్చిన మిషన్ భగీరథ
ఇంటింటికీ నీటి సరఫరా

- నీటి గోసను తీర్చిన 'మిషన్ భగీరథ'
- గతంలో సవి వస్తే చాలు తండా ప్రజల బాధలు వర్ణనాతీతం
- నీటి కోసం కిలోమీటర్ల మేర ప్రయాణం
- గత నాలుగేండ్లుగా ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు
- వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 1.98 లక్షల కుటుంబాలకు నల్లాలతో నీటి సరఫరా

వికారాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఒక్కరోజు రెండు రోజులు కాదు.. కొన్ని ఎండ్లుగా గుక్కెడు తాగునీటి కోసం జిల్లా ప్రజానీకం నానా తిప్పులు, అవస్థలు పడ్డారు. ఒక పూట భోజనం లేకున్నా ఉండొచ్చు, కానీ దాహం తీరకపోతే జీవించడం చాలా కష్టం. ఎన్నో ఎండ్లుగా వేసవి వచ్చిందంటే జిల్లా ప్రజలు తాగునీటి కోసం అల్లాడేవారు. చేతిలో బిందెలు పట్టుకుని కిలోమీటర్లు సైతం ఇంటిల్లిపాదు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకునేవారు. ఊర్లకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్లు, బాగుల్లోని చెలిమెలకు పోయి తాగ నీరు తెచ్చుకునే దయనీయ పరిస్థితి ఉండేది. గుక్కెడు నీళ్లు తాగాలంటే అర్ధరాత్రి ఒంటిగంట వరకు గ్రామాల్లోని బోర్ల వద్ద పడిగాపులుకాయడంతోపాటు ఉదయం తెల్లవారుజామున లేచాల్సిన పరిస్థితి ఉండేది. జిల్లాలోని చాలా గ్రామాల్లో వేసవి వచ్చిందంటే నీటియుద్ధాలు జరుగుతుండేవి. గతంలోని పాలకులు ప్రజల నీటి కష్టాలను పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరందించి ఆపద భగీరథుడయ్యారు. ఏటా వేసవిలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోవడం గుక్కెడు నీటి కోసం కిలోమీటర్లమేర వెళ్లాల్సి వస్తుండటంతో తరుణంలో సీఎం కేసీఆర్ నీటి కష్టాలను తీర్చారు.

1.98 లక్షల కుటుంబాలకు చేరిన భగీరథ నీరు..

మిషన్ భగీరథ పథకంలో భాగంగా జిల్లాకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తాగునీరందుతున్నది. 230 కిలోమీటర్ల దూరంలోని కొల్లాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తూ జిల్లాలోని రాఘవాపూర్, కొడంగల్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ పనుల్లో భాగంగా రూ.1070 కోట్లతో ప్రధాన పైప్‌లైన్లు, ఓహెచ్‌బీఆర్‌ల నిర్మాణం, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం, రూ.413 కోట్లతో ఇంట్రా విలేజ్ పనులను చేశారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని 1,98,162 కుటుంబాలకు ఇంటింటికీ నల్లాల ద్వారా నీరు సరఫరా అవుతున్నది. నిత్యం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా తాగునీటిని అందించేందుకుగాను 1920 కిలోమీటర్ల పైప్‌లైన్, 874 ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మించారు. జిల్లాలోని 971 ఆవాసాలకు నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 2017-19 వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండడంతో 2019 వేసవిలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో తీవ్ర తాగునీటి సమస్య ఎదుర్కోక తప్పదని అనుకున్నారు. అంతేకాకుండా తాగునీటి కోసం వంసలు, గుప్పెడు నీటి కోసం యుద్ధాలు తప్పవేమోననుకున్న సమయంలో మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ సరఫరా చేయడంతో ప్రజలంతా ఊపిరిపీల్చుకున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రతి వేసవిలో తాగునీటి కోసం కిలోమీటర్ల మేర వెళ్లి బోర్లు, బావుల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి కూడా చేయని ఆలోచనను సీఎం కేసీఆర్ ఆలోచించి రూ.కోట్లు ఖర్చు చేసి ఎక్కడో ఉన్న శ్రీశైలం నీటిని తీసుకొచ్చి ప్రజల దాహార్తిని తీర్చారు. మిషన్ భగీరథతో జిల్లా ప్రజల దాహార్తిని బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చిందని జిల్లాలోని సంబంధ వర్గాల ప్రజలు సీఎం కేసీఆర్‌కు జైకొడుతున్నారు. పరిగి సమీపంలోని రాఘవాపూర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

చంద్రాయన్‌పల్లి గ్రామంలోని 'మిషన్ భగీరథ' వాటర్ ట్యాంకు

తాగునీటి తిప్పలు తప్పాయి..

తాగునీటి కోసం తండ్లాట అయ్యేది. బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి బావుల వద్దకు వెళ్లిన రోజులు గుర్తుకొస్తే కంటనీరు వస్తది. పొలాల దగ్గరికి వెళ్లినప్పుడు ఒక్కోసారి కరెంట్ ఉండకపోతుండే. సీఎం కేసీఆర్ సార్ వచ్చాక తండాలో తాగునీటి తిప్పలు తప్పాయి. తండాలో వాటర్ ట్యాంక్‌ని నిర్మించి నల్లాల ద్వారా ఇంటింటికీ తాగునీటిని వదులుతున్నారు. సీఎం కేసీఆర్‌కు ఓటు వేసి రుణం తీర్చుకుంటా.

– విస్లావత్ సోనీ (కద్దాల్)

ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు..

సీఎం కేసీఆర్ మనసున్న మారాజు. సమైక పాలనలో గుక్కెడు తాగునీటికి తహతహలాడేవాళ్లం. తెలంగాణ ఏర్పాటు తర్వాత తీసుకొన్న విప్లవాత్మక నిర్ణయంతో ప్రస్తుతం నదీ జలాలను శుద్ధి చేసి ప్రజలకు అందిస్తుండ్రు. అన్ని గ్రామాలకు నేడు నల్లా నీళ్లు సరఫరా అవుతున్నయ్. మహిళలు బిందెలు పట్టుకొని పొలాల వద్దకు, ఊరు శివారు ప్రాంతాలకు వెళ్లే రోజులు పోయినయ్. ఇప్పుడు ఇంటి ముందుకే తాగునీటిని అందిస్తున్న సీఎం కేసీఆర్ సారు సల్లగుండాలే.

– అనంతమ్మ, గ్రామం అగ్గనూర్ (యాలాల)

నీటి కష్టాలు తీర్చిన దేవుడు కేసీఆర్

తాగునీటి కష్టాలను తీర్చిన దేవుడు సీఎం కేసీఆర్. ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడ్డాం. ఎండాకాలంలో కిలో మీటర్ దూరం బిందెలతో నడుచుకుంటూ వెళ్లి నీళ్లు తెచ్చుకునే బోర్లం. మిషన్ భగీరథ పుణ్యమా అని ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీరు అందుతున్నది.

– యాదం జల్లిరెడ్డి, గ్రామం రెడ్డిపురం (మాడ్గుల)

రోజూ నీళ్లు వస్తున్నాయి..

అప్పట్లో నీళ్ల కోసం ఎంతో ఇబ్బందులు పడినాం.. నీళ్ల కోసం ఊర్లో రోజూ లొల్లులు కూడా అయితుండే. అప్పుడప్పుడు నీళ్ల కోసం చిన్నచిన్న పంచాయితీలు పెడ్తగయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో అంతా మారిపోయింది. మాఊర్లో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వడంతో పొద్దునాలనే స్వచ్ఛమైన నీరు వస్తున్నది. దీంతో గ్రామాల్లో నీళ్ల గొడవలు లేకుండా పోయాయి. కేసీఆర్ సారు మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– మొగిలి పావని(మంచాల)

నీరు పుష్కలంగా వస్తుంది..

ఎండాకాలం వచ్చిందంటే ఖాళీ బిందెలతో ఆందోళనలు చేపట్టేవారు. సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి వందల కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణాజలాలను తీసుకొచ్చి ఇంటింటికీ సరఫరా చేయడం గొప్ప పరిణామం. ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందుతున్నది. నీటి కష్టాలు తీర్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– శ్రీశైలంగౌడ్, మక్తగూడ (షాబాద్)

మంచాల మండలం పటేల్‌చెరువుతండాలో నల్లానీటిని పట్టుకుంటున్న మహిళ

చరిత్రలో నిలిచిపోయే పథకం..

తాగునీటి గోస తీర్చిన మిషన్ భగీరథ పథకం చరిత్రలో నిలుస్తుంది. గతంలో తెల్లవారుజాము నుంచే ఖాళీ బిందెలతో గుట్టల్లో పరుగులు తీయాల్సి వచ్చేది. నేడు మహిళలు ఇంటి వద్దనే స్వచ్ఛమైన శ్రీశైలం కృష్ణా జలాలను కడవల్లో నింపుకొంటున్నారు. ఒకప్పుడు శ్రీశైలం వెళ్లినప్పుడే కృష్ణనీటిని కంటికి అద్దుకునే వాళ్లం. నేడు అవసరాలు తీర్చుకొంటున్నాం. నీటి కష్టాలు తీర్చిన బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం.

– నారాయణరెడ్డి, ధర్మాపూర్, అంగడిరూంహర్ (కొడంగల్)

రోజూ కడుపునిండా నీళ్లు తాగుతున్నం..

ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యాన రోజూ కడుపునిండా నీళ్లు తాగుతున్నం. పదిహేనేండ్లకింద బోర్లకాడకు పోయి నీళ్లు తెచ్చుకునే టోళ్లం, డోసలల్ల తాగేటోల్లం. తెలంగాణ వచ్చినంక నీళ్ల కష్టం పోయింది. ఇంటికాడికే నీల్లొస్తున్నాయి. సీఎం కేసీఆర్ సారుకే మళ్లీ ఓటు వేస్తా.

– కొర్ర మోతి, పటేల్‌చెర్వుతండా (మంచాల)

అప్పట్లో సెలుకలపోంటి పోయేటోళ్లం..

కేసీఆర్ నీళ్లు రాకముునుపు మా తండోళ్లంతా నీళ్ల కోసం బిందెలను తీసుకొని పక్కన ఉన్న సెలుకలపోంటి పోయేటోళ్లం. కానీ ఇప్పుడు తండాలనే ట్యాంక్ కట్టిండ్రు. ఇంటి ముందల నల్లాలు పెట్టిండ్రు. నీళ్ల కోసం ఇప్పుడైతే తిప్పలు లేవు. కేసీఆర్ పుణ్యాన నీళ్లు వస్తున్నయ్.

– నేజీ, కంకరాళ్ల తండా (కేశంపేట)

నీళ్ల తిప్పలు తప్పింది..

ఇప్పుడు అయితే నీళ్ల తిప్పలు లేవు. కేసీఆర్ నల్లాలు లేక ముందు నీళ్ల కోసం చాన ఇబ్బంది పడేది. పొద్దుగాల, పొద్దుమాకి నీళ్ల కోసం మంది బోర్లకాడికి పోయేటోళ్లం. ఇంట్లో ఒకరం పని పోకుండా ఉండి నీళ్లు తెచ్చుకునేది. నీళ్ల కోసం పడిన కష్టాలు గుర్తు చేసుకుంటే బాధకలుగుతది. కానీ ఇప్పుడు ఇండ్ల ముందుకే నీళ్లు వస్తున్నవి. అందరికీ సరిపోను నీళ్లు వస్తున్నవి.

– లక్ష్మీ, కంకరాళ్ల తండా

ఇంటింటికీ నల్లా..

గతంలో గ్రామాల్లో తాగునీటి సమస్యే అతిపెద్దది. ఎండాకాలంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినా సరిపోయేవి కావు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లాచేసి తాగునీటి గోస తీర్చిండు. బీఆర్ఎస్ పార్టీని మళ్లీ గెలిపించుకుంటాం.

– భానూరి మమతారెడ్డి, సర్పంచ్ కక్కులూర్ (షాబాద్)

మంచాల మండలం పటేల్‌చెరువుతండాలో ఇంటి ముందే నల్లా నీటిని పడుతున్న బిన్నారి

తాగునీటి సమస్య తీర్చిన ఘనుడు కేసీఆర్

మిషన్ భగీరథతో తాగునీటి సమస్య తీర్చిన ఘనుడు సీఎం కేసీఆర్. నిత్యం ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా అవుతున్నది. గతంలో వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకునేది. ఒక్కోసారి పని మానుకుని నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఆడబిడ్డల గోస వర్ణనాతీతం. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అక్కడక్కడ చేతిపంపులు వేసినా అవి పని చేసేవికావు. తాగునీటి సమస్యకు శాస్వత పరిష్కారం చూపిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా. మళ్లీ బీఆర్ఎస్ కారుగుర్తుకే ఓటు వేస్తా.

– కదారి అల్లాజీ , గ్రామం ఇర్విన్ (మాడ్గుల)

ఆడబిడ్డల కన్నీళ్లు తుడిచిండు..

సీఎం కేసీఆర్ 'మిషన్ భగీరథ'తో ఆడబిడ్డల కన్నీళ్లు తుడిచిండు. నీళ్ల కోసం తిరగని బావి ఉండేది కాదు. ఎండాకాలం చేతి పంపుల దగ్గర కొట్టుకునేది. ఇప్పుడు ఇంటింటికీ నల్లా నీళ్లు వస్తున్నయ్. కన్నీటి కష్టాలు తీర్చిన కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలె.

– తుల్చ చెన్నమ్మ, జూలపల్లి (మహ్మదాబాద్)


షాబాద్ మండలం అంతారంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం